# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ యువతను అగ్నిపథ్ వైపు ప్రోత్సహించాలని భారత వైమానిక దళం అధికారి సందీప్ అన్నారు.
- ❖ ఆదివాసీల అభివృద్ధితోనే దేశం అన్ని రంగాల్లో వృద్ధి సాధిస్తుందని రాష్ట్రీయ ఇస్పాత్ నిఘం లిమిటెడ్ (ఆర్.ఐ.ఎన్.ఎల్.) డైరెక్టర్ అరుణ్ కాంతి బక్షి పేర్కొన్నారు.
- ❖ సైనికుల సంక్షేమానికి కలిసికట్టుగా కృషి చేయాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు.
- ❖ ఆగ్నేయ బంగాళాఖాతం మీదుగా వున్న ఉపరితల అవర్తనం ప్రభావంతో హిందూ మహాసముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

==============================

పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ రోజు బాపట్ల జిల్లాలో' "ఉపాధ్యాయ - తల్లిదండ్రుల" సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విద్యార్థులతో ముచ్చటిస్తూ... పాఠశాలలో వసతి సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులు మరింత మెరుగ్గా విద్యలో రాణించేలా చూడాలని తల్లి తండ్రులకు సూచించారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే చదువు ఎంతో ముఖ్యమని పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

==============================

యువతను అగ్నిపథ్ వైపు ప్రోత్సహించాలని భారత వైమానిక దళం అధికారి సందీప్ అన్నారు. ఈరోజు పార్వతీపురం ప్రభుత్వ కళాశాలలో అగ్నిపథ్, భారత వైమానిక దళంపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వైమానిక దళం అథారిటీ నుండి కార్పొరల్ సందీప్, సార్జెంట్ ఎస్.డి. ఝూట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, ఇంటర్ లో 50 శాతం ఉత్తీర్ణత సాధిస్తే... వైమానిక దళంలో చేరేందుకు అర్హత ఉంటుందన్నారు. అగ్నిపథ్ లో నాలుగు సంవత్సరాల కాలపరిమితి ముగిసిన అనంతరం 25 శాతం ఉద్యోగ భద్రత ఉంటుందని వివరించారు.

=============================

ఆదివాసీల అభివృద్ధితోనే దేశం అన్ని రంగాల్లో వృద్ధి సాధిస్తుందని రాష్ట్రీయ ఇస్పాత్ నిఘం లిమిటెడ్ డైరెక్టర్ అరుణ్ కాంతి బక్షి పేర్కొన్నారు. ఈ రోజు నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (మై భారత్) ఆధ్వర్యంలో 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనాన్ని విశాఖలోని గీతం విశ్వవిద్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశం గర్వించేలా ఆదివాసీ యువత ఆత్మ విశ్వాసంతో ఎదగాలని పిలుపునిచ్చారు. విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన భారత్ లో ఆదివాసీలు కూడా ఒక భాగమని పేర్కొన్నారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆదివాసీలు తెలుసుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఆయన వివరించారు.

=============================

సైనికుల సంక్షేమానికి కలిసికట్టుగా కృషి చేయాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. సైనికదళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రోజు ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో పతాక నిధికి విరాళం, మాజీ సైనికులకు మెమోంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాజీ సైనికుల సంక్షేమానికి పతాక నిధి పేరిట విరాళాలు సేకరించడం జరుగుతుందన్నారు.

=============================

పండుగ వాతావరణంలో ఆత్మీయ సమావేశంలా, మధుర స్మృతిలా నిలిచిపోయేలా “ఉపాధ్యాయ- తల్లి దండ్రుల” సమావేశాలు నిలుస్తాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చంనాయుడు అన్నారు. ఈ రోజు శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. అలాగే అనకాపల్లి జిల్లా పరవాడ మండలం తానాం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ... తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సత్సంబంధాలకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.

విరామం

=============================

ఆగ్నేయ బంగాళాఖాతం మీదుగా వున్న ఉపరితల అవర్తనం ప్రభావంతో బెంగాల్, దానిని ఆనుకుని ఉన్న తూర్పు భూమధ్య రేఖ ప్రాంత హిందూ మహాసముద్రం వద్ద అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని, రానున్న 24 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశం వుందని వాతావరణ కేంద్రం అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

=============================

ప్రార్ధనా మందిరాల నిర్మాణాలతో ప్రశాంత వాతావరణంలో భగవంతున్ని స్మరించుకునేందుకు అవకాశం కలుగుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈ రోజు ఏలూరు జిల్లా నూజివీడులో నిర్మించనున్న క్రిస్టియన్ సామాజిక భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రైస్తవుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం 150 కోట్ల రూపాయలను కేటాయించిందని తెలిపారు.

==============================

జిల్లా సమీక్షా కమిటీ (డిఆర్సి) సమావేశం ఈ నెల 9వ తేదీన జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఈరోజు సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 9వ తేదీ ఉదయం 11 గంటల నుండి ఐటిడిఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధ్యక్షతన డీఆర్సీ సమావేశం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని, అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు.

==============================

పాఠశాలల్లో విద్యా ప్రగతికి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల గురుకుల పాఠశాలలలో ఈరోజు జరిగిన "ఉపాధ్యాయుల తల్లిదండ్రుల" సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... బాలికలకు మెరుగైన విద్య అందిస్తే వారు జీవితాంతం ఆనందంగా ఉంటారన్నారు. ఈ లక్ష్యంతోనే సోమశిల.. ఆదురుపల్లి, ఆత్మకూరులలో బాలికల గురుకుల విద్యాలయాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజున అన్ని పాఠశాలలో జరిగిన కార్యక్రమాన్ని ఆయన అభినందించారు.

==============================

యువతలో సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి యువ ఉత్సవ్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఈ రోజు నరసాపురంలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖలు "యువ ఉత్సవ్"ను నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విజ్ఞాన పరికరాల ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను ఆమె పరిశీలించారు.

==============================

వివిధ రకాల రెవెన్యూ సేవలు, ధ్రువపత్రాల జారీపై యూజర్ ఛార్జీల వసూలు నుంచి మినహాయింపు ఇస్తూ.. ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల సందర్భంగా ఇచ్చే వినతులపై మాత్రమే ఈ మినహాయింపు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇందులో సర్వే భూరికార్డుల విభాగానికి చెందిన 5 సేవల నుంచి కూడా మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా సర్వే భూరికార్డుల విభాగం ద్వారా వివిధ ఆన్ లైన్ సేవలను ఉచితంగా అందజేస్తారని తెలిపారు.

==============================

విద్యా వ్యవస్థలో మార్పు తీసుకువచ్చేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని శాప్ ఛైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలోని సత్యనారాయణపురంలోని ప్రభుత్వ పాఠశాలలో ఈరోజు జరిగిన "బడివైపు ఒక అడుగు.. తల్లిదండ్రులతో ముచ్చట్లు" అనే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నామని.. "ప్రైవేటు పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలే ముద్దు" అన్న విధంగా తల్లిదండ్రులే చెప్పేలా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో వసతులను కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

==============================

==============================